జూకు కొత్త హంగులు



మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్ | పక్షుల జోన్‌లలో అద్దాలతో ఆధునికీకరించిన బర్డ్స్ ఎన్‌క్లోజర్లు

- సీఎస్సార్ నిధులతో పనులు
- ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- సందర్శకులు సులభంగా చేరుకునేలా అంతర్గత రహదారుల నిర్మాణం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొత్తదనం సంతరించుకుంటోంది. ఇతర ప్రాంతాల జూ పార్కుల నుంచి తీసుకొచ్చిన కొత్త వన్యప్రాణులతో పాటు కొత్త నిర్మాణాలతో కళకళలాడుతోంది. జూలో అధికారులు ఇటీవల అవసరమైన పలు భవన నిర్మాణాలు చేపట్టారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇంకొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. వన్యప్రాణులకు అవసరమైన ఎన్‌క్లోజర్ల నిర్మాణంతో పాటు సందర్శకుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు.

జూలో రెండేళ్లలో సుమారు రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఐవోసీఎల్ సీఎస్‌ఆర్ నిధులను రూ. 2 కోట్లు అందించింది. ఆ నిధులతో జూ పార్కులో బయోస్కోప్ ఆధునికీకరణ, హిమాలియన్ బేర్ నైట్‌క్రాల్, హైనా మోటో, పాముల జోన్ వద్ద మరుగుదొడ్లు, ఖడ్గమృగం నైట్‌క్రాల్ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బయోస్కోప్ భవనం నిర్మాణంలో ఉంది. మరో రూ.2 కోట్ల జూ నిధులతో మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్, రెండు స్లాత్ బేర్ ఎన్‌క్లోజర్లు, బార్కింగ్ డీర్ నైట్‌క్రాల్, డేక్రాల్ ఎన్‌క్లోజర్, సావనీర్ షాపు, రెండు చోట్ల చిన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకుల సౌలభ్యం కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వీటితో పాటు జూలో డీర్ సఫారీని పునః ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇందు కోసం రిలయన్స్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులు రూ.2 కోట్లు ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఆ నిధులతో డీర్ సఫారీ, హుద్‌హుద్ సమయంలో కూలిపోయిన రాబందుల ఎన్‌క్లోజర్‌ను అభివృద్ధి చేయనున్నారు. టయోటో సంస్థ కూడా జూ అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. ఆ నిధులతో జూ ప్రధాన ద్వారాన్ని ఆధునికీకరించడానికి జూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



పాముల జోన్ వద్ద సందర్శకుల కోసం కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు



జూలో నిర్మాణంలో ఉన్న బయోస్కోప్ భవనం



కోతుల జోన్‌లో నిర్మాణంలో ఉన్న పాత్‌వే

వేసవి శిబిరాలకు విశేష స్పందన

విశాఖ విద్య: విద్యార్థులకు వినోదంతో పాటు, విజ్ఞానం అందించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల కు విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను విద్యార్థులకు అందించడంతో పాటు రోజూ ఏదో ఒక అంశంపై పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం జగదాంబ సెంటర్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రముఖ పాఠ్య పుస్తక రచయిత డి. సంజీవ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా వివిధ అంశాల్లో పోటీ లు నిర్వహిస్తుంచడం అభినందనీయన్నారు. జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను కొనసాగిస్తామని గ్రంథాలయ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు తెలిపారు. విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అసిస్టెంట్ లైబ్రేరియన్ రాజేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనాథాశ్రమానికి మహిళ అప్పగింత

మల్కాపురం: అయోమయ స్థితిలో తిరుగుతున్న ఓ మహిళను మల్కాపురం పోలీసులు గుర్తించి అనాథాశ్రమానికి అప్పగించారు. వివరాలిలా.. మల్కాపురం పోలీసులు ఆదివారం అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో శ్రీహరిపురం సమీప ప్రాంతంలో ఒంటరిగా సంచరిస్తున్న ఓ మహిళను గుర్తించారు. ఆమెను ప్రశ్నించగా.. తన పేరు పూర్ణిమ, వయసు 29 ఏళ్లు, తండ్రి పేరు ప్రసాద్‌రావు, తాను దువ్వాడ ప్రాంత వాసినని బదులిస్తూనే తనలో తానే మతి స్థిమితం లేనట్టుగా మాట్లాడుకుంది. గమనించిన పోలీసులు సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కర్‌రావు సాయంతో ఆమెను సోమవారం ఉదయం నగరంలోని టీఆర్‌ఎస్ కాంప్లెక్స్ దరి అనాథాశ్రమానికి అప్పగించారు. ఆమె బంధువుల వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.



ఆశ్రమానికి మహిళను అప్పగిస్తున్న పోలీసులు, చెల్లూరి భాస్కర్‌రావు

పద్యాలతో తెలుగు భాషకు వెలుగు

మల్కాపురం: చందో బద్ధమైన పద్యాలు తెలుగు భాషను సుసంపన్నం చేస్తునాయని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం పలువురు చిన్నారులకు తెలుగు పద్యాలు, వాటి అర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క పద్యం అయినా నేర్చుకోవాలన్నారు.సుమతి శతకం,వేమన శతకం,కుమారి శతరం,భాస్కర శతకం మొదలైన వాటిల్లో పద్యాలు నేర్చుకుని, వాటి అర్థాలను తెలుసుకోవాల్సిన అవసరం నేటి బాల బాలికలకు ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో అతిథులు భాగ్యలక్ష్మి, సత్తిరాజు

క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థినికి అభినందన



ఎండీ షబ్నీని అభినందిస్తున్న కాలేజీ సిబ్బంది

కంచరపాలెం: ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన థర్డ్ ఇయర్ ఫలితాల్లో కంచరపాలెం గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని మోహ్మద్ షబ్నీ బీ కామ్ డిగ్రీలో యూనివర్సిటీ థర్డ్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం గౌరీ కాలేజీలో షబ్నీని కళాశాల ప్రెసిడెంట్ డి.కె.ఎ.సత్యనారాయణ, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలతో ముందుగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.కుమారి, నూక అప్పారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న జైభీమ్ యూత్ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఎంబీజీ కాలనీలోని చిల్డ్రన్ పార్కులో బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ కోచ్ ప్రసాద్, షేక్ ఆలీ, ప్రేమల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ శిబిరంలో జైభీమ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఈశ్వరరావు, సుదర్శన్ తదితరులు పిల్లలకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ శిబిరాల ద్వారా చిన్నారుల్లో ఉన్న ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ స్థాపకులు మజ్జి రమేష్, జగదీష్, కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ మారువారం



అన్నప్రసాదం వడ్డిస్తున్న పుర్రె సురేష్‌యాదవ్, నమ్మి గౌరీశ్వరరావుయాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి మారు వారం పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు.గత వారం ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మారు వారం పండగ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమ్మవారికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్,నారాయణరాజు,గాలి సన్యాసిరావు తదితరులు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

గెడ్డల్లో పూడికల తొలగింపు



శ్రీరామ్‌నగర్ గెడ్డలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులోని పలు గెడ్డల్లో సోమవారం పూడికలు తొలగించే పనులు చేపట్టారు. శ్రీరామ్‌నగర్‌లోని గెడ్డలో పూడిక తొలగించారు. వార్డులోని గెడ్డలను శుభ్రం చేస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. వర్షాకాలం వచ్చేలోగా గెడ్డల్లో పూడికలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గమాంబ తొలేళ్ల సంబరం





ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ, అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గానగర్ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అమ్మవారి తొలిప్రతిమకు పూజలు చేసి ఘటాల ఊరేగింపు ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు మొదలైన ఈ ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ మీదుగా తీసుకొచ్చి కంచరపాలెంలోని సీతారామాలయం, సంపత్ వేంకటేశ్వరాలయం, ధనలక్ష్మి ఆలయాల ఆవరణలో నిలిపారు. అనంతరం తోటవీధిలోని పుట్టబంగారం వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు పర్యవేక్షించారు.

నేషనల్ గేమ్స్‌లో అన్సర్ వలికి బంగారు పతకం

మల్కాపురం: ఈ నెల 25, 26 తేదీల్లో జమ్మూ కశ్మీర్ జమ్మూ యూనివర్సిటీలో సంయుక్త భారతీయ ఖేల్ ఫెడరేషన్(ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో నేషనల్ గేమ్స్ జరిగాయి. ఈ పోటీల్లో శ్రీహరిపురం సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న అన్సర్ వలి పాల్గొని బంగారు పతకం సాధించారు. 35 ప్లస్ కేటగిరీలో జరిగిన పవర్‌లిఫ్టింగ్, 5 వేల మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్ త్రో లో అన్సర్ వలి అద్భుత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఆయనను గోల్డ్ మెడల్ వరించింది. జమ్మూ ఆర్మీ సుబేదార్ మేజర్ ఎండీ యూసఫ్, ఎస్‌బీకేఎఫ్ ఫౌండర్ పంకజ్ గౌలే చేతుల మీదగా వలి బంగారు పతకం అందుకున్నారు. శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ, ఇతర సిబ్బంది ఫోన్‌లో అన్సర్ వలిని అభినందించారు.



బంగారు పతకం అందుకుంటున్న అన్సర్ వలి

నో పార్కింగ్ బోర్డుల ఏర్పాటు

మల్కాపురం: ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ రహదారిలో వాహనాలు పార్క్‌చేయకుండా మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ మార్గానికి ఇరువైపులా ఆయిల్ ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాల అనధికార పార్కింగ్‌ను నిరోధించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే స్థానిక కంపెనీల ప్రతినిధులతో పోలీసులు మాట్లాడి సర్వీస్ రోడ్డులో ప్లాంట్‌కు వస్తున్న లోడ్, ఆయిల్ లారీలను పార్క్ చేయకుండా చూడాలని సూచించారు. సోమవారం ఉదయం ట్రాఫిక్ ఎస్ఐ జి.అప్పారావు ఆదేశాలతో సిబ్బంది సర్వీస్ రోడ్డుకు ఇరుపైపులా నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో లారీలు ఇక్కడ పార్క్‌చేయకపోవటంతో సర్వీస్ రోడ్డు ఎంతో విశాలంగా కనిపిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, పాదచారులు ట్రాఫిప్ పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఐవోసీ ప్లాంట్ సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డు

క్యాంపస్ డ్రైవ్‌లో 250 మంది ఎంపిక

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, జేసీఐ భారత్ యువ సంకల్ప్ కన్సల్టెన్సీ సంయుక్తంగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించాయి. సర్వీస్, ఫైనాన్స్, బీమా, సాఫ్ట్‌వేర్ రంగాలకు సంబంధించి 32 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ విభాగాలకు సంబంధించి 650 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా, 250 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు ప్రాంభించిన కార్యక్రమంలో గ్లోబల్ ట్రస్ట్ నుంచి పి.శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షుడు చంద్రశేఖర్, అమెజాన్ హెచ్‌ఆర్ ఆర్ సునీల్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, వివిధ పరీక్షల ద్వారా పలువుర్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.




ఉద్యోగాలకు ఎంపికైన వారితో నిర్వాహకులు

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పరిరక్షణ

ఏపీఎఫ్‌ఈఆర్‌డబ్ల్యూఏఎస్ జోనల్ కో ఆర్డినేటర్ పులకల మాధవరావు



సింహాచలం: భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జోనల్ కోఆర్డినేటర్ పులకల మాధవరావు చెప్పారు. విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్‌లో సభ్యత్వం కలిగిన కాలనీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఒక్కో జోన్ పరిధిలో 8 చొప్పున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పెందుర్తి జోన్‌లో కృష్ణరాయపురం సమీపంలోని ఎస్ఏడీ కాలనీ, సింహాచలంలోని ప్రియా గార్డెన్స్, సింహపురి లేఅవుట్, పద్మావతినగర్ కాలనీ, షిప్‌యార్డ్ లేఅవుట్, ఎయిర్‌పోర్టు దగ్గర ఉన్న విమాన నగర్‌కాలనీలో ఒక్కొక్కటి చొప్పున, ప్రహ్లాదపురంలోని మోదీ స్ట్రీట్‌లో రెండు ఇంకుడు గుంతలు తొలివిడతగా తీస్తున్నట్టు తెలిపారు. వాటికయ్యే ఖర్చును ఏపీఎఫ్‌ఈఆర్‌డబ్ల్యూస్ అందిస్తుందన్నారు. ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ అధ్యక్షుడు ఉదయ్ శిర్నామి, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, సెక్రటరీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయన్నారు.



ప్రియాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

అవగాహన కార్యక్రమాలు విస్తృతం

ఇంకుడు గుంతల ఆవశ్యకతపై ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. 93వ వార్డులో నిర్వహించిన అవగాహన సదస్సుల వల్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందని మాధవరావు చెప్పారు. దీనిలో భాగంగా ఆయా ఇళ్ల యజమానుల సొంత ఖర్చుతోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ కాలనీ ప్రతినిధి గార్లపాటి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గాలమ్మ మారువారం పండగ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజు పాలెం గ్రామ దేవత దుర్గాలమ్మవారి మారు వారం పండగ మంగళవారం ఘనంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.



నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

30 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్–2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెనుమత్స సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి దర్శనం, అర్చన ప్రత్యేక పూజలు, భక్తుల సంకీర్తనలు, సామూహిక పారాయణం నిర్వహిస్తారు.

- 30న ఉదయం 6.30 గంటలకు యోగ సిద్ధాంజనేయ స్వామివారి దర్శనం, 7 గంటలకు అర్చన, 9 గంటలకు విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, రుత్విక్వరుణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, సాయంత్రం 5.30 నుంచి అష్టోత్తర శత కలశారాధన(108 కలశారాధన) తీర్థగోష్ఠి ప్రసాద వితరణ జరుగుతాయి.
- 31న ఉదయం 9 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం , అష్టోత్తర శతకలశ స్నపనం, అర్చన, తీర్థగోష్ఠి, ప్రసాద వితరణ అనంతరం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులచే సామూహిక సుందరకాండ పారాయణం, తమలపాకులతో అర్చన, రాత్రి 7 గంటలకు విశేష హోమం నిర్వహిస్తారు.
- జూన్ 1న ఉదయం 5 గంటలకు మంగళ ధ్వని 5.30కు సుప్రభాత సేవ, 6.30కు విశేష అలంకరణలో యోగ సిద్ధాంజనేయ స్వామి దర్శనం, 7 గంటలకు అర్చన, 8.30కు విశేష హోమాలు, పూర్ణాహుతి, 9.30కు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర నామార్చన, రాత్రి 8.30కు భజనానంద హారతి, రాత్రి 9 గంటలకు వేద ఆశీర్వచనం స్వస్తితో హనుమజ్జయంతి ఉత్సవాలు ముగుస్తాయి.



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం

మహారాణిపేట: వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమంపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రోగ్రాం అధికారుల సమావేశంలో రుతుక్రమం–ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ అని, సాధారణంగా 10 నుంచి 14 ఏళ్ల లోపు మొదలై 45–49 ఏళ్ల మధ్యలో రుతుక్రమం ఆగిపోతుందని చెప్పారు. 'టుగెదర్ ఫర్ ఏ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్' ఈ ఏడాది నినాదమని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు అందుబాటులో శానిటరీ నాప్‌కిన్‌లు, ఐరన్ పోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం





అప్పన్న నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.